యువత శాస్త్ర సాంకేతికతపై దృష్టి పెట్టాలి

- జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్
- జిల్లాలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
- పాఠశాలల్లో ఆకట్టుకున్న విద్యార్థుల ఎగ్జిబిట్లు

చెన్నారావుపేట : విద్యార్థుల ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 27 : యువత శాస్త్ర సాంకేతికపై దృష్టి పెట్టి నూతన ఆవిష్కరణలు చేయాలని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కే శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని సిద్ధార్థ హై స్కూల్, జల్లి, ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలకు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఎంపీడీవో శ్రీవాణి, ఎస్సై రాజేశ్‌రెడ్డి, ఎంఈవో సరళ, ట్రస్మా డివిజన్ అధ్యక్షుడు పాశికంటి రమేశ్, జిల్లా ఉపాధ్యక్షులు జాంగీర్, మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఉప్పరపల్లి పాఠశాల హెచ్ఎం జయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తిని కనబర్చాలి

నర్సంపేట, ఫిబ్రవరి 28 : విద్యార్థులు భౌతిక, విజ్ఞాన శాస్త్ర విషయాలపై ఆసక్తిని కనబర్చాలని నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లం నవీన్ అన్నారు. శుక్రవారం జాతీయ సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని శ్రీఅభ్యాస్ స్కూల్‌లో జరిగిన వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నరహరి స్వాతి-రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రఘు, రాజేందర్, సునిత, రేణుక, దివ్య, లావణ్య, స్రవంతి, రియాజ్, శ్రావణి, నర్సింహారెడ్డి తదితరులున్నారు. లక్నెపల్లి బాలాజీ టెక్నో స్కూల్‌లో జరిగిన వేడుకల్లో బిట్స్ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులున్నారు. అదేవిధంగా మహేశ్వరం హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో శ్రీగురుకుల ఫౌండర్ మోతె సమ్మిరెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఉపాధ్యాయులు అందజేశారు.

సైన్స్‌ఫెయిర్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత

పోచమ్మమైదాన్ : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్ ఎంతో ఉపయోగపడుతుందని అల్లూరి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోజెస్ క్రిష్టఫర్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వరంగల్ దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ పాఠశాలలో విద్యాసంస్థల చైర్మన్ జేఎస్ పరంజ్యోతి అధ్యక్షతన శుక్రవారం సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు అంశాలపై ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంజీఎం వైద్య నిపుణుడు డాక్టర్ ఏ నాగరాజు, పాఠశాల ట్రెజరర్ జన్ను అరుణ, పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే ఎల్‌బీ నగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి పాఠశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. పాఠశాల హెచ్ఎం మాధవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కరీమాబాద్ : విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కివీ పాఠశాల హెచ్ఎం దాసి సతీశ్‌మూర్తి అన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కివీ పాఠశాలలో సైన్స్, కల్చరల్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ అన్నదేవర ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ దాసి రజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శివనగర్ ప్రభుత్వ స్కూల్‌లో..

ఖిలావరంగల్ : గ్రేటర్ వరంగల్ 35వ డివిజన్ శివనగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను హెచ్ఎం నరేంద్రస్వామి ప్రారంభించారు. విద్యార్థులు పలు ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, అంజయ్య, ధనలక్ష్మి, నరేందర్, కవిత, సుజాత, శ్రీనివాస్, దేవరాజు, తిరుపతి, రంగాచారి పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో విజ్ఞాన శాస్త్రానిది కీలకపాత్ర

గీసుగొండ : మండలంలోని వంచనగిరి, గంగదేవిపల్లి, కొమ్మాలతోపాటు పలు ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని మచ్చాపురంలోని ప్రగతి హైస్కూల్‌లో శుక్రవారం సైన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, సీఐ మహేందర్, ప్రిన్సిపాల్ మధుకర్, హైమవతి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, కుమారస్వామి, సలీంపాషా, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

దుగ్గొండి : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిర్నిబావిలో న్యూవిజన్, నాచినపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సివి రామన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళిఅర్పించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, క్విజ్, పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు వెలుదండి సుమలత, మధుసూదనన్, శ్రీనివాస్, గీత, సుమలత, సుధీర్‌కుమార్, మాధవ్‌రావు, కమల, ప్రదీప్ పాల్గొన్నారు.

ఎగ్జిబిట్స్‌ను పరిశీలించిన జిల్లా సెన్స్ అధికారి..

పర్వతగిరి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సెన్స్ అధికారి జీ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లను తిలకించి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో లింగారెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్ఎం పాక రమేశ్‌బాబు, సైన్స్ టీచర్లు మనోహర్, రవికుమార్, రవీందర్, రాజు పాల్గొన్నారు. అలాగే ఆర్డీఎఫ్ రోళ్లకల్ పాఠశాలలో రంగోలి, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పలు ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. హెచ్ఎం భాషబోయిన రాములు, అసిస్టెంట్ హెడ్మాస్టర్ రమేశ్, ఇన్‌చార్జి బాలరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని విస్‌డమ్ పాఠశాలలో విద్యార్థుల ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సుధాకర్, శ్రీనివాస్, సైన్స్ టీచర్లు ఇంద్రజ, భవాని, వీణ, స్రవంతి, గౌతమి, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యం సాధించకుంటే చర్యలు తప్పవు

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, ఫిబ్రవరి 28 : పన్నుల సేకరణలో నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవని గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఆమె పన్నుల వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తం లక్ష్యంపై దృష్టి సారించాలన్నారు. పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేసినా స్పందించకుంటే ఫర్నిచర్ జప్తు చేయాలని ఆదేశించారు. అతి తక్కువ పన్నులు వసూళ్లు చేస్తున్న ఆర్ఐ, బిల్ కలెక్టర్లపై ఆర్వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 117.27 కోట్ల లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.52.66 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు కమిషనర్‌కు తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, రాజేశ్వర్, ఆర్వోలు శ్రీనివాస్, యూసుఫొద్దీన్ పాల్గొన్నారు.

ఆర్థిక అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యం

జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న

నర్సంపేట, ఫిబ్రవరి 28 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, ఆర్థిక అభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న అన్నారు. శుక్రవారం మండలంలోని రాజపల్లి గ్రామంలో మైత్రీ మహిళా పొదుపు సంఘం 17వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న పెద్ది స్వప్న మాట్లాడుతూ ఆర్థిక క్రమ శిక్షణ పొదుపుతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ పొదుపును అలవర్చుకోవాలని కోరారు. అనంతరం ఆమెను మహిళా సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నామాల భాగ్యమ్మ, మైత్రీ పొదుపు సంఘం బాధ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నగరంలో మీ సేవ కేంద్రాల తనిఖీ

ఖిలావరంగల్, ఫిబ్రవరి 28: వరంగల్, హనుమకొండ నగరాల్లోని పలు మీ సేవా కేంద్రాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు అందించాల్సిన సేవలలో కొంత మంది నిర్వాహకులు దళారులతో కుమ్మక్కై దోచుకుంటున్నారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేశారు. మీ సేవా కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్న వినియోగదారులతో అధికారులు మాటాడి వారి నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నట్లు తెలిసింది.

నగరంలో నాయీ బ్రాహ్మణుల ఆందోళన

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 28 : వరంగల్‌లో ఇతర సామాజిక వర్గానికి (మైనార్టీ) చెందిన వ్యక్తులు సెలూన్ షాపు ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుసుకున్న నాయీ బ్రాహ్మణులు శుక్రవారం ఆందోళనకు దిగారు. పోచమ్మమైదాన్, 80 ఫీట్ల రోడ్డు మార్గంలో ఇతర వ్యక్తులు సెలూన్ షాపు పెట్టడానికి అద్దెకు తీసుకుంటున్నారని తెలియగానే నగర నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కస్తూరి సతీశ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. షాపు నిర్వాహకుడు సాబీర్‌తో అందరి సమక్షంలో సెలూన్ షాపు పెట్టడం లేదంటూ ప్రమాణం చేయించారు. అనంతరం నాయీ బ్రాహ్మణులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జిల్లా నాయీ బ్రాహ్మణ కమిటీ సభ్యులు రాజేందర్, దశరథం, సతీశ్‌కుమార్, మధుసూదన్, సందేటి వేణు, నాగరాజు, కరుణాకర్, కృష్ణ, సదానందం, రాజేశ్, యుగేందర్, కన్నయ్య, ఉపేందర్, రమేశ్, రాజ్‌కిరణ్, రవీందర్, సహదేవుడు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట, ఫిబ్రవరి 28 : పట్టణంలోని ద్వారకపేట బైపాస్‌రోడ్డులోని వరద కాల్వను ఆక్రమించిన వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ 17వ వార్డు ప్రజలు అధికారులను కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు, ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారికి వేర్వేరుగా వారు వినతి పత్రాలను అందించారు. అదేవిధంగా ఇదే వార్డులోని శ్మశాన వాటిక దారి కబ్జా చేసి దహన సంస్కారాలకు పోనివ్వకుంగా భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వార్డు ప్రజలు వేల్పుల మల్లయ్య, శ్రీనివాస్, భాస్కర్, పొన్నాల వీరస్వామి, ఎల్లస్వామి, ఇస్రాం బాబు, చింత సాంబయ్య పాల్గొన్నారు.

బేస్‌బాల్ క్రీడలో విద్యార్థుల ప్రతిభ

నల్లబెల్లి, ఫిబ్రవరి 28 : మండలంలోని రంగాపూర్ గ్రామ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు లోకేశ్, చరణ్‌రాజ్ అనే విద్యార్థులు బేస్‌బాల్ క్రీడలో అత్యంత ప్రతిభ కనబరిచారు. మార్చి 1,2 తేదీల్లో గజ్వేల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎం అనురాధ విద్యార్థులను అభినందించారు.

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

ఖానాపురం, ఫిబ్రవరి 28 : కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దబీర్‌పేటలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. దబీర్‌పేట గ్రామానికి చెందిన పిండి ఉప్పలయ్య (70) తరచుగా భార్య ఐలమ్మతో ఘర్షణ పడుతుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం భార్య ఐలమ్మతో చిన్న గొడవ పడి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. గమనించిన మరో రైతు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు పిండి స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నల్లబెల్లి, ఫిబ్రవరి 28 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని బోల్లోనిపల్లె గ్రామానికి చెందిన బోల్ల సర్వేషం-లత దంపతులకు కుమారుడు బోల్ల అభిరామ్ (17) ఉన్నాడు. ఈ నెల 17న తండ్రి మందలించాడని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతిడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నర్సంపేట, ఫిబ్రవరి 28 : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని రాజుపేట శివారు నర్సంపేట-మల్లంపల్లి జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు.. నర్సంపేట పట్టణానికి చెందిన కే చక్రపాణి ద్విచక్రవాహనంపై పని నిమిత్తం నర్సంపేట నుంచి రాజుపేటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో రాజుపేట శివారు ప్రధాన రహదారిపై రోడ్డు క్రాస్ చేస్తున్న చక్రపాణి బైక్‌ను వెనుకాలే వచ్చిన మరో బైక్ ఢీకొట్టడంతో అతడు కిందపడగా కాలు విరిగింది. స్థానికులు చక్రపాణిని చికిత్స నిమిత్తం హనుమకొండలోని గార్డియన్ ఆస్పత్రికి తరలించారు.

తప్పిపోయిన వ్యక్తిని అప్పగించిన పోలీసులు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 28 : ఎంజీఎంలో చికిత్స పొందుతూ కనిపించకుండా పోయిన వ్యక్తిని గుర్తించిన ఔట్‌పోస్టు పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రుద్రోజు వేణుగోపాల్ శుక్రవారం ఉదయం కనిపించకుండా పోయాడు. కుటుంబసభ్యులు ఎంజీఎం హాస్పిటల్ ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించి, మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం ఔట్‌పోస్టు పోలీసులు ఎంజీఎం హాస్పిటల్‌లో గస్తీ తిరుగుతున్న సమయంలో అపస్మారకస్థితిలో ఆటోలో పడివున్న వ్యక్తిని వేణుగోపాల్‌గా గుర్తించి మట్టెవాడ పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం అందించి, చికిత్స నిమిత్తం వార్డుకు తరలించారు. కనిపించకుండాపోయిన వ్యక్తిని గుర్తించి ఔట్‌పోస్టు ఏఎస్సై ఆదినారాయణ, హెడ్‌కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్స్ బొట్టు కమలాకర్, ఎండీ ముజిద్, సందీప్‌లకు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఖిలావరంగల్, ఫిబ్రవరి 28 : మార్చి 5వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు. ఇంటర్మీడియెట్ పరీక్షలు, ఎల్ఆర్ఎస్‌పై శుక్రవారం హైదరాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ 4,967 మంది, ఒకేషనల్ 848 మంది విద్యార్థులు, అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ 5,739 మంది, ఒకేషనల్ 767 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నం. 9240205555 ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమీక్షలో బల్దియా కమిషనర్ అశ్వినీతానాజీ వాకడే, డీఆర్వో విజయలక్ష్మి, డీఐఈవో శ్రీధర్‌సుమన్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, విద్యుత్, ఆర్టీసీ, పోలీసు, పోస్టల్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : డీఐఈవో

గిర్మాజీపేట, ఫిబ్రవరి 28 : అధికారులు సమన్వయంతో పనిచేసి మార్చి 5నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో డాక్టర్ శ్రీధర్ సుమన్ సూచించారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు సీఎస్, డీవోలుగా విధులు నిర్వర్తించే అధికారులతో శుక్రవారం శ్రీధర్‌సుమన్ జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఐఈవో శ్రీధర్‌సుమన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 26పరీక్షా కేంద్రాల్లో ఫస్టియర్‌లో 5,815, సెకండియర్‌లో 6,506 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 26పరీక్షా కేంద్రాలకు 26మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 26మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను, పరీక్షల పర్యవేక్షణకు జిల్లా పరీక్షల కమిటీ(డెక్), ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు నియమించినట్లు తెలిపారు. విద్యార్థులకు వార్షిక పరీక్షలపై ఏమైనా సందేహాలు ఉంటే 9240205555 టోల్‌ఫ్రీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డెక్ మెంబర్ కాక మాధవరావు, విజయనిర్మల, జిల్లా ప్రశ్నపత్రాల ఇన్‌చార్జి అశోక్‌రావు, సంపత్, కార్యాలయ సిబ్బంది రాజశేఖర్, రఫీ, సందీప్, కొలంబో పాల్గొన్నారు.

ఓంకార్, బీఎన్ రెడ్డిల ఆశయ సాధనకు ఉద్యమించాలి

ఎంసీపీఐ పాలిట్ బ్యూరో సభ్యుడు మర్రెడ్డి వెంకట్‌రెడ్డి

ఎంసీపీఐ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మర్రెడ్డి వెంకట్‌రెడ్డి

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 28 : కామ్రేడ్ ఓంకార్, బీఎన్ రెడ్డిల ఆశయ సాధనకు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ఎంసీపీఐ పాలిట్ బ్యూరో సభ్యుడు మర్రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం 27వ డివిజన్ పరిధిలో ఎంసీపీఐ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కేంద్ర కమిటీ సభ్యులు సింగతి సాంబయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, మోర్తాల చందర్‌రావు, చంద్రశేఖర్, నరసయ్య, తాటికొండ రవి, మాదం తిరుపతి, రాజేశ్, శేఖర్, బాషిపాక రమేశ్, పలువురు కార్మిక సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌గ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

WANTED TEACHERS
★WANTED TEACHERS For High School Section with B. Ed., & For Primary Section with Graduation. Send your Resume Whatsapp:9949033066/9989429744.
NTW-482

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565


రాంబాబు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న

గుండె పోటుతో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ భర్త మృతి

నివాళులర్పించిన జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న

నర్సంపేట, ఫిబ్రవరి 28 : నర్సంపేట మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు మాజీ కౌన్సిలర్ బాణాల ఇందిర భర్త, బీఆర్ఎస్ పట్టణ ముఖ్యనాయకుడు బాణాల రాంబాబు (46) శుక్రవారం ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి రాంబాబు గుండెపోటుకు గురై అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. విషయం తెల్సుకున్న జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న రాంబాబు ఇంటికి చేరుకొని నివాళులర్పించారు. అనంతరం ఇందిరను ఓదార్చి ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, జిల్లా నాయకుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేనుముద్దల శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, బండి రమేశ్, నాయకులు పెండ్యాల యాదగిరి, అనిల్ తదితరులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

సంగెం, ఫిబ్రవరి 28 : సంగెం మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య భవన్‌లో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ సత్యశారద పరిశీలించారు. టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు యంగ్‌వన్ కంపెనీ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. సంగెం మండలంలోని 72మంది రైతులు భూములు కోల్పోయారని, అందులో 48మంది మహిళలు కుట్టుశిక్షణకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేసి వారికి యంగ్‌వన్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు. అనంతరం ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌ను సందర్శించిన కలెక్టర్ సంబంధిత ఐటీడీఏ అధికారులతో మాట్లాడి ఆ భవనాన్ని పీఆర్, డీఆర్‌డీఏ ఆదీనంలో ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ భవనం జిల్లా మహిళ శిక్షణ నైపుణ్య కేంద్రంగా ఉపయోగించుకునే అవకాశాన్ని కలెక్టర్ సూత్రపాయంగా తెలిపారు. ఎస్సారెస్పీ భూములకు సంబంధించిన భవనానికి హద్దులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య, ఏపీఎం డీ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్

దుగ్గొండి : మండల